పత్తేదారు



కొండేపూడి సూర్యకామరాజు

చెప్పుకోతగ్గ స్నేహితులెవరూ ఆమెకు లేక పోయినా, పేటలోవుండే చాలమంది భాను మతియెడల సానుభూతి కనపరచేవారు. ఆమె చాలా అమాయకురాలని యిరుగు పొరుగు వారి విశ్వాసం.

భానుమూర్తి కొన్నినెలలక్రితం చిన్న ప్రమా దానికి గురియై మరణించాడు. అతడు భార్యను పెట్టిన కష్టాలు తెలిసినవాళ్లెవరూ అతని చావుకి విచారించలేదు. భానుమతి వంటి సద్గుణసంపన్ను రాలు భానుమూర్తివంటి కిరాతకుడికి భార్య కావ టం చాలా విచారకరమైన విషయంగా పరిగణించే వారు.

ప్రమాదం జరిగినరోజున, భానుమతి మేడమీద నుండి చాలరోజులనుంచి ఉపయోగంలేక మూల పడివున్న 'ఎలెక్ట్రిక్ ఫైర్' కిందకు తీసుకువచ్చింది. చలి విపరీతంగా వున్నందువల్ల పడకగది కాస్త వెచ్చచెయ్యవచ్చు గదా అని ఆమె వుద్దేశ్యం. కాని దానికి ప్లగ్గు అమర్చబడి వుండకపోవటంవల్ల దాన్ని పడకగదిలో మంచంమీద పెట్టి ఎలెక్ట్రిషియన్ కొరకు కబురుపంపే ప్రయత్నంలోవుంది.

ఇంతలో భానుమూర్తి చలితో వణుకుతూ యింటికివచ్చి 'ఫైర్' చూసి, దానివల్ల వేడిపుట్టించి చలిపోగొట్టుకోవచ్చు కదా అని తనే దానికి ప్లగ్గు వెయ్యటానికి పూనుకున్నాడు. ఫైర్ వంటింట్లోకి తీసుకెళ్ళి స్క్రూడ్రయివర్‌తో పని సాగించాడు. ప్లగ్ అమర్చిన వెంటనే మామూలుగా యిస్త్రీపెట్టెకు వుపయోగపడుతున్న ప్లగ్ పాయింటుకి యీ ప్లగ్ పెట్టాడు, టెస్టు చెయ్యడానికి. వెంటనే ఒక్క మెరుపు మెరిసింది. ఉత్తర క్షణంలో భానుమూర్తి కిందపడిపోయాడు.

ఈ సందర్భంలో పంచాయతీదార్లు వేసిన ప్రశ్నకు జవాబిస్తూ, ఇంటికి వచ్చేటప్పటి తన భర్త మితిమీరి త్రాగివున్నాడని భానుమతి చెప్పింది. ఇంకొకప్రశ్నకు జవాబిస్తూ, తన భర్తకు విద్యుచ్ఛక్తి గురించి అంతగా తెలీదనీ, 'ఎలెక్ట్రిక్ ఫైర్'కు కట్టబడివున్న చిన్న కాగ్తంమీది సూచనల ననుసరించి ప్లగ్ బిగించినాడనీ ఆమె చెప్పింది.

పోలీసువారి పరిశోధననుబట్టి భానుమూర్తి చేసిన పొరపాటు సులువుగా గ్రహించవచ్చు. ఫైర్ యొక్క కేబిల్‌లో మూడు సన్నవైర్లు వున్నై. వాటిలో రెండు— ఒకటి ఎరుపూ, ఒకటి నలుపూ—కరెంటుకి కలపడానికి ఉద్దేశింప బడినవి. ఆకుపచ్చ రబ్బరు తొడిగిన మూడో తీగె, ప్లగ్ యొక్క 'ఎర్త్‌పిన్'కు తగిల్చేది. భాను మూర్తి ఎరుపూ ఆకుపచ్చతీగలలో తికమకపడి, ఫైర్ యొక్క లోహభాగంనుండి వెళ్లే ఆకుపచ్చ తీగెను యర్త్‌కు అమర్చకుండా కరెంటుకిపెట్టాడు. ఆసమయంలోనే ఫైర్‌ను తన యెడమచేత్తో పట్టుకునివున్నాడు. అందువల్ల విద్యుచ్ఛక్తి అతడి శరీరంలో ప్రవహించి తత్ఫలితంగా ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

పంచాయతీ తీర్పు 'యాక్సిడెంటల్ డెత్' అని వేరే చెప్పనక్కర్లేదు.

పాపం! ఆవిధంగా భానుమతి భర్తను పోగొట్టుకొని తనకు గల కొద్దిరాబడితో నిరాడంబర జీవితం గడుపుతోంది. ఆమె ఎవరియిళ్ళకూ వెళ్ళదు, ఎవరూ ఆమెయింటికి రారు. కాని యీమధ్య పురుషోత్తం పెళ్ళాం పార్వతి మాత్రం భానుమతిని చూట్టానికి తరచు వస్తోంది.

పార్వతి పూర్వం భానుమతి యింటిపక్కనే వుండేది. భానుమూర్తి మరణించిన కొద్ది రోజులకి పట్నంలో యింకో యింటికి వెళ్ళిపోయింది. ఆమె ఎక్కడవుంటున్నదీ యెవరికీ వివరంగా తెలీదు.

పార్వతి భానుమతివద్దకు చాలసార్లు వచ్చింది. ఇవన్నీ పిలవని పేరంటాలే. వచ్చినప్పుడల్లా కుశల ప్రశ్నలయిన వెంటనే భానుమూర్తి మరణాన్ని గూర్చి మాట్లాడుతుంది, ఎంతో శ్రద్ధతో. భానుమతి మాత్రం అమాయకంగానూ, ఆవేశం లేకుండానూ మాట్లాడేది. ఆమె పార్వతి నేమీ ప్రశ్నించేది కాదు. ఆఖరుకి పార్వతి ఎక్కడ వుంటున్నదీ కూడా ఆమె కనుక్కోలేదు.

ఈ విధంగా కొన్నాళ్లు గడిచాక, పార్వతివచ్చి యితర విషయా లేమీ మాట్లాడకుండా భర్త మరణాన్ని గూర్చే తవ్వుతూండటంవల్ల భానుమతికి ఆమె రాక విసుపునూ అసహ్యాన్నీ కలిగించటం మొదలుపెట్టింది. సాయంత్రం పడుతుందంటే భానుమతికి గుండెదడ మొదలుపెట్టేది. ఏ క్షణంలో పార్వతి వస్తుందో, ఏమేం ప్రశ్నలువేసి తనను బాధిస్తుందో అని ఆమెకు విపరీతమైన భయం వేసేది. అసలు పార్వతి తన యింటికి ఎందుకు రావాలి? తన్నా విధంగా ప్రశ్నించి, అసలే భర్త మరణానికి కుమిలికుమిలి ఏడుస్తోన్న తన్నెందుకు యింకా ఏడిపించాలి? పోనీ, అసలు యింక రావొద్దని చెప్పేస్తే—ఈ విధంగా ఆలోచించేది, ఒకొక్కప్పుడు. కాని తీరా పార్వతి వచ్చాక ఏమీ అనలేకపోయేది - ఎందుకో, ఆమె కా మనో దౌర్బల్యం!

రెండురోజులు తిరక్కుండానే మళ్లీ పార్వతి వచ్చింది. ఈసారి ఆమె మామూలుగా వచ్చేటట్టు సాయంత్రం కాక ఉదయాన్నే వచ్చింది, తన రాకలో ఏదో విశేషాన్ని సూచిస్తూ.

'నీ భర్త మరణాన్నిగూర్చి మాట్లాడాలి' మామూలుగా వేసే కుశల ప్రశ్న యినా వెయ్యకుండా, గుమ్మంలో కాలుపెడుతూనే అంది పార్వతి.

అసలు పార్వతి వస్తుందంటేనే భానుమతికి గుండె దడపుడుతుంటే, ఇంక యీ ప్రశ్న వినేటప్పటికి ఆమెమనస్సు ఎట్లా వుంటుందో వర్ణించటం అనవసరం.

'—అంటే ఏగో ప్రశ్నలతో ప్రాణాలు తీస్తావన్న మాట' భానుమతి అంది. తన ఓర్పును పిడికిట్లో బిగించి.

'అబ్బే లేదు. నిన్ను యిప్పటికి ఎన్నోసార్లు ప్రశ్నించాను. ఇక వాటిని సింహావలోకనం చెయ్యటమే తరవాయి.'

భానుమతి గాభరా ఎక్కువైంది. ఆమె మౌనం వహించటంకన్న యింకేమీ చెయ్యలేకపోయింది.

పార్వతి మళ్ళీ అందుకుంది.

'మీ ఆయన వచ్చేలోపున నువ్వే ప్లగ్గు అమర్చటానికి ప్రయత్నించలేదని ఆ రోజున చెప్పావు. నీకు చేతకాదు కాబట్టి చెయ్యలేదని చెప్పావు. ఈసంగతే నువ్వు పంచాయతీలోకూడా చెప్పావు-అవునా?'

భానుమతి అవునన్నట్లు కిందచూస్తూ వూరుకుంది.

'నీ భర్తకు కొద్దిగ వర్ణదోషం (కలర్ బ్లయిండ్ నెస్) ఉందన్నావు!' దొరికిపోయావులే దొంగవి, అన్నట్టు చూస్తూ అంది పార్వతి.

పార్వతి మాట్లాడుతున్నంతసేపూ భానుమతి ముఖవర్ణం అనేకరకాలుగామారుతోంది. ప్రస్తుతం ఎర్రగా కందగడ్డలాగా వున్న ఆమెముఖం అణచివుంచిన కోపాన్ని తెలియబరుస్తున్నది. ఆమె యేమీ మాట్లాడలేదు.

"ఈ విషయాలన్నీ ఆలోచించి నేను కొన్ని సత్యాలను బయటపెట్టవలసివుంది—నువ్వు యుద్ధకాలంలో—అంటే నీ పెండ్లికిముందు విద్యుచ్ఛక్తి పరికరాలను తయారుచేసే కార్ఖానాలో పని చేశావు. అందువల్ల నీకు ప్లగ్గు అమర్చే స్వల్ప విషయం తెలీవంటే దాంట్లో యేమీ అర్థంలేదు. నువ్వు చెప్పినది అబద్ధమని నేను వేరే చెప్పనక్కర్లేదు."

భానుమతికి ముచ్చెమటలూ పోశాయి. పెదవులు చప్పరించి వూరుకుంది.

"ఇక వర్ణదోషం వున్నవాడిని విమానంలో పైలట్ గా తీసుకుంటారంటే నువ్వు నమ్ముతావా? —భానుమూర్తి యుద్ధంలో విమానపు పైలట్ గా పనిచేశాడు. అందువల్ల అతడికి వర్ణదోషం వుందంటం పూర్తిగా అసత్యం. పోనీ తర్వాత వచ్చిందనుకుందామంటే వర్ణదోషం పుట్టుకతో వచ్చేదనీ, మధ్యలో ఎప్పుడూ రాదనీ నువ్వు ఏ డాక్టరు

నడిగినా చెబుతాడు—నువ్వు ఆశ్చర్య పడనక్కర్లేదు. ఇవన్నీ, నేను వాకబు చెయ్యగా బయట పడిన సత్యాలు—అతడు పైలట్‌గావున్నప్పుడే కదూ, నీతో మొట్ట మొదట పరిచయం ఏర్పడింది?”

ఈ స్థితిలో భానుమతి మనోభావాలనుచెప్పటం కష్టమే. బహుశా- కోపం, ఓటమీ, అన్నిటి కన్నా ఎక్కువ—భయం కలిసి ఆమె మనస్సును కలచి వుండొచ్చు.

“అయితే నువ్విప్పుడ నేదేమిటీ?—ముందు నా యింట్లోంచి బయటికి నడు. నన్ను ప్రశ్నించటానికి నీకేం అధికారంలేదు.” మొండిధైర్యం తెచ్చుకుని రబ్బరు బుడగలా పేలింది, భానుమతి.

“చెల్లీ, శాంతించు. ఇప్పుడు నేను బయటికి పోయినా నీకేమీ లాభముండదు. ఈ మాటే మొట్ట మొదట అంటే నీకు లాభించివుండును.” ఎంతో శాంతాన్ని ప్రదర్శిస్తూ అంది, పార్వతి.

“నాకులాభం వుండనక్కర్లేదు. ముందు బయటకు నడిచి మరీ మాట్లాడు.” కోపంతో వణికి పోతూ అంది, భానుమతి.

ఈ మాటని నిర్లక్ష్యంచేసి తన ‘హాండ్ బాగ్’ తెరిచింది పార్వతి.

ఒక్కసారిగా ముఖంలోని రంగంతా పోగొట్టుకొని తెల్లగా పాలిపోయింది, భానుమతి. దాన్లోంచి ఏ యాటంబాంబు బయటపడుతుందో అని సంచీ మీదే దృష్టి నిలిపింది.

యాటంబాంబు బయటపడలేదుకాని పార్వతి అరచేతిలో రెండు సన్నని రబ్బరు గొట్టపుముక్కలు కనపడ్డాయి. ఒకటి ఎరుపూ—మరొకటి ఆకు పచ్చా. భానుమతి మూర్ఛపోవలసిందే కాని మూర్ఛ పోలేదు. అప్రయత్నంగా అంది.

“ఇవి...యివి నీకెట్లా...”

“అవును, ఇవి నా దగ్గరకు వచ్చాయి, నీ అశ్రద్ధవల్ల—జ్ఞాపకంలేదూ? నువ్వు ఆ రోజున చీకటిపడ్డాక, అంటే ప్రమాదం సంభవించినరోజున,



మీ యింటికీ మా యింటికీ మధ్యనున్న గోడదగ్గర నిలబడి ఏదో విసరటం, నేను షికారునుంచి తిరిగి వచ్చి చీరమారుస్తూ నా గదికిటికీలోంచి స్పష్టంగా చూశాను. కాని అప్పుడా విషయం పట్టించుకో లేదు. తరవాత కొన్ని గంటల్లో, ప్రమాదం విషయం తెలిసింది. మర్నాడు పంచాయతీనుండి తిరిగి వచ్చాక వీటికోసం వెతకటంలో నే నాట్టే ఆయాసపడవలసిన అవసరం లేకపోయింది.

భానుమతికి భయము, కోపమూకూడా ఎగిరిపోయాయి. ఆమె గంభీరంగా అంది——

'అవును. అవి నేను విసరినవే.'

'ఇప్పుడు వివరంగా చెప్పు, నువ్వేం చేసిందీ.'

'చెప్పేదేముందీ?——నే నతడిని చంపితీరాలి. అంతకన్న వేరేమార్గం కనపడలేదు. ఒక్క నిమిషంకూడా భరించలేని బాధలు పెట్టాడు. ఎన్నాళ్లు సహించనూ...'

'ఆగు, నిన్ను నేను ఎందుకు చంపావని అడగటంలేదు. ఎట్లా చంపావని అడుగుతున్నా.

'దాంట్లో ఏమీ వింతలేదు. చాలా స్వల్ప విషయం. తంతిలో మొత్తం మూడు సన్నతీగెలు వేర్వేరు రంగులుగల రబ్బరుతో కప్పబడి వున్నై. నేను చేసిందల్లా సుమారు అంగుళం పొడుగున ఎరుపూ ఆకుపచ్చా తీగెలనుండి రెండు రబ్బరు ముక్కలు తీసి ఆరెంటినీ తారుమారుచేసి తగిల్చాను. అంతే నే చేసింది. అంతకంటే యింకేమీ చెయ్యవలసిన అవసరం కూడా లేదు.

'మరి యీ రబ్బరు ముక్కలు ?'

'అవి, తరవాత నాకు కావలసిన పని జరిగిపోయాక' పోలీసువాళ్లకు అనుమానం కలగకుండా, జాగ్రత్తగా కోసితీసేసి విచక్షణలేకుండా మీ యింట్లోకి విసిరాను. 'తర్వాత ప్లగ్గు అవిధంగానే కరెంటుకు తగిల్చి పోలీసుస్టేషనుకి ఫోన్ చేశాను.

'ఆదా సంగతి. అయితే నా చీర మారుముందే అంతా జరిగిపోయిందన్నమాట.'

'అవును.'

పార్వతి లేచింది వెళ్ళడానికి. భానుమతి జాలిగా అడిగింది——

'నువ్విప్పుడు పోలీసుస్టేషనుకి వెడుతున్నావా?'

పార్వతి కొద్దిసే పాలోచించి అంది——

'ఇంకా లేదు. వెళ్లేదీ లేనిదీ నీకు కొద్దిరోజుల్లో తెలియబరుస్తాను. ఈలోపల ఏమీ ఆఘాయిత్యం చెయ్యబోకు–నమస్తే'——పార్వతి వెళ్లిపోయింది. భానుమతి ఒక్కనిట్టూర్పు విడవటంకంటె ఏమీ చెయ్యలేకపోయింది.

సుమారు వారం గడిచాక భానుమతి గుండెలో టెలిఫోన్ గంట గణగణ మోగింది. తన 'వ్రాత' తెలుసుకోటానికి రిసీవరు అందుకొని చెవిదగ్గర పెట్టుకుంది.

'హలో! ఎవరు మాట్లాడేది' టెలిఫోన్‌లో ప్రశ్న.

'నేనూ, భానుమతిని–భానుమూర్తి భార్యని.' ఆదుర్దాతో తడబడుతూ అన్నది, భానుమతి.

'మంచిది. నీకు శుభవార్త. నువ్వింక బెంగపెట్టుకోనక్కరలేదు'——ఈమాట వినపడ్డమేమిటి, భానుమతి తెల్లటిముఖం గులాబివర్ణంగా మారడమేమిటి——రెండూ ఒక్కసారి జరిగినై. 'హమ్మయ్య' అని ఒక్కనిట్టూర్పు విడిచి అంది——

'నీకు నేను చాలా కృతజ్ఞురాల్ని. నీ రుణం ఎట్లా తీ...'

'దానికేంలే —— అన్నట్టు నువ్వు సంగతి విన్నావా? పాపం-మా వారు మొన్న లక్ష్మివారం నాడు విద్యుత్ప్రమాదంవల్ల స్వర్గస్థులయారు. పంచాయతీ తీర్పు యిప్పుడే తెలిసింది–ప్రమాదంవల్ల మరణం.'

(ఇంగ్లీషు కథకి స్వేచ్ఛానువాదం)

పిల్లవాడు: నాన్నా, మొదట మాట్లాడేయంత్రాన్ని ఎడిసన్ చేసిన మాట నిజమే?

తండ్రి: లేదుబాబూ దేవుడుచేశాడు. ఆపివెయ్యడానికి వీలుండే మొదటిదాన్ని ఎడిసన్ చేశాడు.